ప్రజాశక్తి
సోమవారం 24 ఏప్రిల్ 2023




## నేటి నుంచి వ్యవసాయ పరిశోధనా మండలి సమావేశం

**శ్రీకాకుళం అర్బన్ :** ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలు ఈనెల 24, 25 తేదీల్లో నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఉత్తర కోస్తా సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.కె జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాల్లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఆంగ్రూ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బిరామిరెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశాల్లో ప్రధాన శాస్త్రవేత్తలు, ఉత్తర కోస్తా జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా వ్యవసాయ ఉద్యానవన, అనుబంధ రంగాల అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొంటారని తెలిపారు. 2023-24 సంవత్సరానికి గానూ చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

# పశు బీమా డబ్బులు ఏవీ?

- మూడేళ్లుగా ఆగిన పరిహారం చెల్లింపులు
- జిల్లాలో రూ.14 కోట్ల మేర బకాయిలు
- ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు

**రాష్ట్ర ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అటకెక్కించింది. మృత్యువాత పడిన పశువులకు మూడేళ్లుగా డబ్బులు చెల్లించడం లేదు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్ధకశాఖ అధికారుల చుట్టూ పాడి రైతులు తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను మొర పెట్టుకుంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల బారిన పడిన పశుపెంపకందారులను ఆదుకునేందుకు అమలు చేస్తున్న ఈ పథకంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో పాడి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పథకాన్ని నిలిపేసినట్లు ప్రచారం సాగుతుండడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పాడి రైతులు తమ పశువుల బీమాకు ఎటువంటి ప్రీమియం చెల్లించనవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో ఏ రైతూ సొంతంగా బీమా చేయించుకోలేదు. 2020 నుంచి ఈ పథకం ద్వారా ఎవరికీ లబ్ధి చేకూరడం లేదు. పశువుల బీమా ఉంటే మేలు జాతి పశువు మృతి చెందితే రూ.30వేలు, సాధారణ రకమైతే రూ.15 వేలు చెల్లిస్తారు. పశువు మృతి చెందిన 24 గంటల్లో రైతు పశువైద్యాధికారికి సమాచారం ఇస్తే, 48 గంటల్లో



పోస్టుమార్టం పూర్తి చేసి ఆపై సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసేవారు. సమగ్ర విచారణకు డీడీ, ఎడి, ఇద్దరు పశువైద్యుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుంది. 2020 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో 4,800 పశువులు మృత్యువాత పడ్డాయి. వీటికి సంబంధించి పశుబీమా పరిహారం కోసం రైతులు, పెంపకందారులు క్లయిమ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత అధికారులూ ఆమోదం తెలిపారు. పశువులకు సంబంధించి రూ.14 కోట్లు బకాయిలు ఉన్నాయి.

### మూడేళ్లుగా అందని పరిహారం

గతంలో ప్రయివేటు కంపెనీల ద్వారా ప్రీమియం చెల్లించిన వారికి తమ పశువు చనిపోతే బీమా సొమ్ము అందేది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వమే రైతుల తరుపున సొమ్ము చెల్లించేలా మార్పు చేసింది. మృతి చెందిన పశువుల వివరాలను ఎప్పటికప్పుడు మండల వైద్యాధికారులు పంపుతున్నారు.

### కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

క్లయిమ్‌లను పరిష్కరించాలని పశుపెంపకందారులు, రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, రైలు, రోడ్డు ఇతర ప్రమాదాలు, వ్యాధుల బారిన పడి వేలాది పశువులు మృత్యువాత పడ్డాయి. కొత్తగా పశువుల కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు. కనీసం ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చినా కొంతమేర ఉపయోగపడేవని రైతులు వాపోతున్నారు. మండలాల్లోని వెటర్నరీ ఆస్పత్రులు, పశుసంవర్ధకశాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు.

### పరిహారం చెల్లింపులపై స్పష్టత కరువు

పశువుల బీమా చెల్లింపుల నిలిపివేతపై ఇటీవల నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సభ్యులు ప్రశ్నించినా ఫలితం కనిపించడం లేదు. పశువుల బీమా వివరాలను రిజర్వ్‌బ్యాంకుకు పంపామని అధికారులు చెప్తున్నారు. బీమా డబ్బులపై ఎప్పుడు అడిగినా త్వరలోనే ఖాతాల్లో నగదు జమ అవుతుందంటూ రైతులకు బదులిస్తున్నారు.



ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

## బిజెపిని గద్దె దించితేనే దేశానికి విముక్తి

- మోడీ ప్రమాదకర విధానాలపై ప్రజా ఉద్యమాలు
- రాష్ట్రంలోని మూడు పార్టీలు కలిసి రావాలి
- నారాయణపురం భూముల సాగుదారులకు పట్టాలివ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలను అనుసరిస్తున్న బిజెపిని గద్దె దించితేనే దేశానికి విముక్తి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. సిపిఎం, సిపిఐ ప్రచారభేరిలో భాగంగా ఎచ్చెర్ల మండలం చిలకపాలెం కూడలిలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రానికి మొండిచేయి చూపిందని విమర్శించారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని ఏడు వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన వెనుకబడిన ప్రాంత నిధులను ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తామంటూ బిజెపి ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు, రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకోవడానికి పోరాటం చేయాల్సిన జగన్మోహన్‌రెడ్డి మోడీకి మోకరిల్లుతున్నారని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబునాయుడు మోడీ కనుసన్నల్లోనే మెలుగుతున్నారు తప్ప పోరాడే పద్ధతుల్లో వ్యవహరించడం లేదన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల తీరు ఇలా ఉంటే పవన్ కళ్యాణ్ తీరు కూడా అలానే ఉందన్నారు. రాష్ట్రానికి హానికరమైన మోడీ విధానాలను వ్యతిరేకించడానికి మూడు పార్టీలూ ప్రజా ఉద్యమాల్లో కలిసి సిపిఎం, సిపిఐ కోరుతున్నాయన్నారు. ఉపాధి హామీ చట్టంలో సాంకేతిక పరిజ్ఞానం పేరుతో యాప్‌ల ద్వారా హాజరు విధానాన్ని తీసుకొచ్చి పేదల పొట్ట కొట్టాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందన్నారు. యుపిఎ-1 హయాంలో వామపక్షాలు పట్టుబట్టి సాధించిన ఉపాధి హామీ చట్టం, అటవీహక్కుల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం కక్షతో నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. చిలకపాలెంలో తరతరాలుగా సాగు చేస్తున్న రైతులకు సాగుహక్కు పత్రాలు ఇవ్వకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, భూ కబ్జాదారులకు వైసిపి ప్రభుత్వం అండగా నిలుస్తోందని విమర్శించారు. సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వని ప్రభుత్వం రాష్ట్రంలో 2.80 లక్షల చుక్కల భూములను పెద్దలకు కట్టబెట్టాలని చూస్తోందని చెప్పారు. నారాయణపురం భూముల సాగుదారుల సమస్యలపై తొలి నుంచి సిపిఎం పోరాడుతోందని చెప్పారు. సాగులో ఉన్న రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. ప్రధాని మోడీ అండదండలతో అదానీ ప్రపంచాన్ని ఏవిధంగా మోసం చేసి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిడెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసినా, దాని మీద విచారణకు అంగీకరించకుండా కేంద్ర ప్రభుత్వం వెనకేసుకొస్తోందని తెలిపారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్యులపై భారాలు మోపుతోందన్నారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో పేర్కొన్నా, మోడీ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తోందని విమర్శించారు. అంతకుముందు చిలకపాలెంలోని యాదవ వీధి నుంచి చిలకపాలెం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.తేజేశ్వరరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, తోనంగి నందోడు, పి.కైలాష్, కోరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



మృతదేహానికి నివాళ్లర్పిస్తున్న జెమ్స్ వైద్యులు, సిబ్బంది

## చనిపోతూ ఐదుగురికి ప్రాణదానం

- బ్రెయిన్ డెడ్‌తో విద్యార్థి మతి
- అవయవ దానానికి అంగీకరించిన తల్లిదండ్రులు
- గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు తరలింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, సోంపేట

పదో తరగతి చదువుతున్న ఆ విద్యార్థి తాను చనిపోతూ అవయవ దానంతో ముగ్గురికి ప్రాణ దానం చేశాడు. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాడు. శ్రీకాకుళం జిల్లా సోంపేటలోని గీతామందిర్ కాలనీకి చెందిన మల్లారెడ్డి మోహనరావు, గిరిజ కళ్యాణి కుమారుడు కిరణ్ చంద్ (15) స్థానిక ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 15వ తేదీన పదో తరగతి చివరి పరీక్ష రాస్తున్న సమయంలో తీవ్రమైన తలనొప్పి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రిలో చూపించగా, మెరుగైన వైద్యం కోసం వారు విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి రిఫర్ చేశారు. పరిస్థితి ఇంకా విషమించడంతో శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఐదు రోజుల పాటు అక్కడి వైద్యులు రోగిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

ఆదివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయినట్లు గుర్తించి విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. బ్రెయిన్ డెడ్ కేసులో అవయవాలు దానం చేయొచ్చని, మీరిచ్చే అవయవ దానంతో మరికొంత మందికి జీవితాన్ని ఇవ్వవచ్చని జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, ఎపి జీవన్‌దాన్ సమన్వయకర్తలు మృతుని కుటుంబసభ్యులు, బంధువులకు అవగాహన కల్పించారు. కుమారుడు ఇక తిరిగి రాడన్న శోకసంద్రంలో ఉన్నా... వారు తీసుకున్న నిర్ణయం ఐదుగురి కుటుంబాల్లో వెలుగులు నింపింది. అంతేకాకుండా అవయవదానంతో సమాజానికి మార్గదర్శకంగా నిలిచింది.



కిరణ్ చంద్ (ఫైల్)

గ్రీన్ ఛానల్ ద్వారా తరలిస్తున్న అవయవాలు

### గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు తరలింపు

మృతుని తల్లిదండ్రులు గుండె, కిడ్నీలు, లివర్, కళ్లు దానం చేసేందుకు అంగీకరించారు. తిరుపతికి గుండె, విశాఖపట్నంకు కిడ్నీ, లివర్, విజయనగరానికి కళ్లను తరలించేందుకు పోలీసు సిబ్బంది ప్రత్యేక వాహనాలతో గ్రీన్ ఛానల్‌ను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు జెమ్స్ ఆస్పత్రి నుంచి అవయవాలను తరలించగా గ్రీన్ ఛానల్ ద్వారా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో 4.20 గంటలకు విశాఖకు చేరుకున్నారు. చనిపోతూ మరో ఐదుగురి జీవితాల్లో తమ కుమారుడు వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. జిల్లాలో ఇదే తొలి అవయవ దానమని, ప్రతిఒక్కరూ అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలని ఎపి జీవన్‌దాన్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు అన్నారు. అనంతరం విద్యార్థి మృతదేహానికి జెమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఘన నివాళ్లర్పించారు. మృతదేహానికి సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలం

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలమయ్యాయని, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుపై దాడే అందుకు నిదర్శనమని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు విమర్శించారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా పర్యటనలో చంద్రబాబు నాయుడుపై వైసిపి నాయకుల రాళ్ల దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు జరిగితే టిడిపి కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. జెడ్ ప్లస్ భద్రతలో ఉన్న ప్రతిపక్ష నేతకే భద్రత లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాళ్ల దాడి సమయంలో ఎన్ఎస్‌జి సిబ్బంది కాల్పులు జరిపితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. రాళ్ల దాడికి దిగి ఎన్ఎస్‌జి సిబ్బందితో దళితులపై కాల్పులు జరిపేలా చేసి చంద్రబాబు, టిడిపిపై బురదజల్లేందుకు కుట్ర చేశారని విమర్శించారు. చంద్రబాబుపై రాళ్ల దాడికి పాల్పడిన ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, గొర్లె సాయి, పైడి అప్పడుదొర, పిసిని హరికృష్ణ, మజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కళా వెంకటరావు

## మధ్యాహ్న భోజనం 'ప్రయివేటు'కు వద్దు

- మెనూ ఛార్జీలు పెంచాలి
- ఎండిఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి
- సంఘ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించవద్దని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా 5వ మహాసభను నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకంలో పనిచేస్తున్న వారిని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఐదో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలన్నారు. మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20కు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే రాయితీపై సరఫరా చేయాలని కోరారు. సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలని, పథకాన్ని ప్రయివేటు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించకుండా కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. 20 ఏళ్లగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పోరాటం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండు వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యి మాత్రమే వేతనం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. పనిలో అగ్ని ప్రమాదాలకు గురవుతున్నా ఎలాంటి వైద్య బీమా సౌకర్యం లేదని చెప్పారు.

పథకం అమలుకు పాఠశాలలో వంటషెడ్లు, వంటపాత్రలు, మంచినీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. రాగిజావ తయారు చేయడానికి గ్యాస్ ఖర్చు కార్మికుల పైనే భారం పడుతోందన్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటమ్‌తో ప్రభుత్వం మెనూ తయారు చేసి భారాన్ని మోపిందని తెలిపారు. నూతన విద్యా విధానం అమలు వల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొమ్మన లేకుండా పొగ పెడుతున్న చందంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అక్షయపాత్ర, మరికొన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించిందన్నారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో వాటిని రద్దు చేసి కార్మికులతోనే పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. మెళియాపుట్టి మండలం జాడుపల్లిలో పాఠశాలలో వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించి చికిత్స పొందుతూ మృతి చెందిన కార్మికురాలు మలిపెద్ది రమాదేవి కుటుంబానికి రూ.20 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మహాసభలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లు.మహాలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, కె.సూరయ్య, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.అమరావతి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.రాజు, బి.హరీష్ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రమాదేవి

### నూతన కార్యవర్గం ఎన్నిక



సుశీల



ఉత్తర

మహాసభల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, జిల్లా అధ్యక్షులుగా కె.సుశీల, ప్రధాన కార్యదర్శిగా బి.ఉత్తర, కోశాధికారిగా ఆర్.రాధ, ఉపాధ్యక్షులుగా ఎస్.గీతాబాల, జి.పద్మ, భూదేవి, కార్యదర్శులుగా వి.లక్ష్మి, ఎ.కళావతి, టి.సీతమ్మ, 10 మంది ఆఫీసు బేరర్స్, 36 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## వలస బాట

- అంతంతమాత్రంగా 'ఉపాధి'
- పనుల్లేక పల్లెలను విడిచిపోతున్న కూలీలు

ప్రజాశక్తి - పొందూరు

కరువు, వలసలను నివారించి, స్థానికంగానే కూలీలకు పని కల్పించడం గ్రామీణాభివృద్ధి సాధించడం లక్ష్యాలతో రూపొందించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అంతంతమాత్రంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గించడంతో ఆ ప్రభావం కూలీలపై పడుతోంది. చట్టం ప్రకారం పని అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాల్సి ఉన్నా ఆ మేరకు జరగడం లేదు. కూలీలకు సరిగా పనులు కల్పించకపోవడంతో, పనుల కోసం పొట్ట చేత పట్టుకుని వలస పోతున్నారు.

పొందూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో కల్పించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయం పనులు లేకపోవడంతో పనుల కోసం కూలీలు ఎదురుచూస్తున్నారు. అందరికీ పని కల్పించేందుకు అవకాశం లేకపోవడంతో సమీప గ్రామాలకు, ఇతర మండలాలకు, పట్టణాలకు వేల సంఖ్యలో వలసబాట పడుతున్నారు. తెల్లవారుజామునే ఇంటి, వంట పనులు ముగించుకుని సద్ది కట్టుకుని పొట్ట చేతపట్టుకుని ఆటోల్లో బయలుదేరుతున్నారు. మండలంలోని రాపాక, కింతలి, వి.ఆర్ గూడెం, తుంగపేట, తోలాపి, గోరింట, పెనుబర్తి, మొదలవలస తదితర గ్రామాల్లో పూర్తిస్థాయిలో పనులు లేకపోవడంతో వేతనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు కల్పించాలని అధికారులను వేడుకుంటున్నా ఇదిగో అదిగో అంటూ చెప్తున్నారే తప్ప పనులు ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల వైఫల్యం

మండలంలో 29 పంచాయతీల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.15 కోట్లతో ఉపాధి హామీ పనులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామసభలను నిర్వహించి సుమారు 197 చెరువులు, సుమారు 230 కాలువల్లో పనులు చేసేందుకు గుర్తించారు. పనులను గుర్తించినా పనులను చేపట్టడంలో అధికారులు చొరవ చూపడం లేదంటూ కూలీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో గ్రామాల్లో పనులు చేసేందుకు చెరువులు అనుకూలంగా ఉన్నాయి. వర్షాలు పడితే చెరువుల్లో నీరు చేరుపోయి పనులు చేయలేని పరిస్థితి నెలకొంటుందని కూలీలు వాపోతున్నారు.

### పనుల కోసం పక్క గ్రామాలకు తరలివెళ్తున్న కూలీలు

స్థానికంగా పనులు లేకపోవడంతో గ్రామీణ ప్రజలు పస్తులు ఉండలేక సమీప గ్రామాలకు, మండలాలకు, పట్టణాలకు పొట్టకూటి కోసం వలస బాట పడుతున్నారు. ఈ పనులు కోసం ఆటోలపై పరిమితికి మించి ఎక్కి ప్రయాణాలు సాగిస్తున్నారు. కిక్కిరిసిన ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తూ గతంలో పలు సందర్భాల్లో ప్రమాదాల బారిన పడ్డారు. పనికి వెళ్తేనే పూట గడుస్తుందని, స్థానికంగానే పనులు కల్పించాలని కోరుతున్నారు.

### ఉపాధి పనులు కల్పించాలి


ఈ ఏడాది ఉపాధి పనులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. స్థానికంగా నిత్యం ఉండే క్వారీ పనులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు పనులకు వెళ్తున్నాం. కొద్దిరోజులు పోతే వర్షాలు మొదలై పనులు చేయలేని పరిస్థితులు ఉంటాయి. అధికారులు వెంటనే ఉపాధి పనులు కల్పించాలి.

- పి.రమణమ్మ, రాపాక, పొందూరు

### పనుల మంజూరులో జాప్యం వల్లే

మండలంలోని ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు చేపడుతున్నాం. మిగిలిన గ్రామాల్లోనూ మంజూరైన పనులను భువన్ యాప్‌లో నమోదు చేసి పూర్తిస్థాయిలో కూలీలకు పనులు కల్పిస్తాం. కొన్ని గ్రామాల్లో పనులు మంజూరు కాకపోవడంతో పనులు కల్పించడంలో ఆలస్యమైంది. పూర్తిస్థాయిలో కూలీలకు పనులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం.

- ఆర్.శ్రీనివాసరావు, ఎపిఒ, పొందూరు



రాపాకలో పనులు కావాలని కోరుతున్న కూలీలు

## నేడు మడ్డువలస రెండో దశ పనులకు శంకుస్థాపన

**పొందూరు :** మడ్డువలస కాలువ రెండో దశ విస్తరణ పనులకు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజులతో పాటు పలువురు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## నేడు ఎస్‌టి కమిషన్ చైర్మన్ రాక

**శ్రీకాకుళం :** రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఈనెల 24న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విశ్వవిద్యాలయ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

### పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని లొద్దభద్రలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అప్పలరాజుకు నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సాంకేతిక కారణాలు వల్ల ఏదైనా సంక్షేమ పథకాలు రాని వారిని గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ అభివృద్ధి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉంగ ప్రవీణ, మండల పార్టీ అధ్యక్షుడు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకట్రావు (చిట్టి), వైసిపి జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, అగ్రికల్చర్ అడ్వైయిరీ బోర్డు చైర్మన్ గొర్లె వేణుగోపాలరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, వైస్ ఎంపిపి తలగాన శ్రీరాములు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కొర్ల శివకృష్ణ, సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవికుమార్, విప్ గొండి మోహనరావు, యువజన నాయకులు మామిడి నర్సింహమూర్తి, జెడ్‌పిటిసి ప్రతినిధి మచ్చ ధనరాజ్, యువశక్తి కో-ఆర్డినేటర్ ఫ్రాంచష్ తామరశెల్లి పాల్గొన్నారు.

## నేడు 'చలో తహశీల్దార్ కార్యాలయం'

ప్రజాశక్తి- రణస్థలం

యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులందరికీ పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని ఈ నెల 24న చలో తహశీల్దార్ కార్యాలయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు పిలుపునిచ్చారు. మండలంలోని బంటుపల్లి కూడలి వద్ద ఆదివారం యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలు ఇచ్చిన స్థానిక కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు ఇవ్వకుండా అర్ధాంతరంగా నిలుపుదల చేయడం అన్యాయమన్నారు. దీంతో 600 మంది కార్మిక కుటుంబాలను రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి పనిదినాలు కల్పించలేని పక్షంలో చట్టప్రకారం 50 శాతం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటి అద్దెలు చెల్లించలేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాజమాన్యం కార్మికులపై వేధింపులకు, కక్ష సాధింపులకు పాల్పడడం సరికాదన్నారు. సమావేశంలో పి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, భద్రయ్య, చిన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

# రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపి


ప్రచార భేరిలో పాల్గొన్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ వ్యాప్తంగా సిపిఎం, సిపిఐ చేపడుతున్న ప్రచార భేరి శ్రీకాకుళం నగరంలో ఆదివారానికి పదో రోజుకు చేరింది. నగర ప్రజలను చైతన్యపరుస్తూ చేపట్టిన కార్యక్రమంలో నగరంలోని కెల్లవీధి, పాండురంగవీధి, తెప్పలవీధి, పుణ్యపు వీధుల్లో ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, నగర కన్వీనర్ తిరుపతిరావు, సిపిఐ నగర కన్వీనర్ డోల శంకరరావులు పాల్గొని మాట్లాడారు. లౌకిక రాజ్యంగా ఉన్న దేశంలో మతోన్మాద శక్తులు పాలన సాగిస్తూ ప్రజల మధ్య మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నారని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధిగా పాలనసాగిస్తున్న మోడీని గద్దెదించాలన్నారు. మతోన్మాద విధానాలతో దేశాన్ని వెనక్కు తీసుకెళ్తున్న మోడీ తక్షణమే గద్దె దిగాలన్నారు. ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేని మోడీ పాలనను విమర్శించారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి, మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెస్తున్న తీరు దేశానికి నష్టమని పేర్కొన్నారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు, కార్మికులకు నష్టం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ చర్యలను తప్పుపట్టారు. కార్యక్రమంలో నాయకులు కె.భాస్కరరావు, ఎ.సోమశేఖర్, కె.సూరయ్య, ఎం.గోపి, బి.లక్ష్మి, పి.ప్రభావతి, టి.బుజ్జిబాబు, ఎస్.శ్రీనివాసులు, ఆర్.ప్రకాశరావు, పాల్గొన్నారు.

**కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి**

**వజ్రపుకొత్తూరు :** మండలంలోని నువ్వలరేవులో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచార భేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బమ్మాడి ఆనందరావు మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన మోటారు చట్టంలో 12 ఏళ్ల దాటిన ఏ వాహనం వాడకూడదని, వాడితే శిక్షలకు గురిచేస్తామని చెప్పడం రవాణా రంగాన్ని దెబ్బ తీయడమేనని అన్నారు. పెట్రోల్, డీజలు ధరలు పెరగడంతో ఆటో రంగం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ ఎన్.మోహనరావు మాట్లాడుతూ సహజ మత్స్యకారులకు వేట లేకుండాపోయిందన్నారు.


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ఆనందరావు


కొత్తూరు : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బి.రామకృష్ణ, ఎన్.చంద్రయ్య, ఆటో యూనియన్ నాయకులు ఊర్వశిరావు, మల్లేశ్వరవు, జగదీష్ పాల్గొన్నారు.

**అదనపు పరిహారం చెల్లించాలి**

**కొత్తూరు :** మండలంలోని ఇరపాడు నుంచి మెట్టూరు బిట్ 1,2,3 నిర్వాసిత గ్రామాల్లో ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగరావు సింహాచలం మాట్లాడుతూ వంశధార నిర్వాసితులకు రూ.లక్ష అదనపు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదనపు పరిహారం కోసం సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, నిర్వాసితులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కోయిలాపు శ్రీనివాసరావు, సంజీవరావు, మీసాల షణ్ముఖరావు, గొట్ట మోహనరావు, పెంటయ్య, కృష్ణప్రసాద్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

# ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు


మెమోంటోను అందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. వైశాఖ మాసం తొలి ఆదివారం కావడంతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. వీరితో పాటు వివిఐపిల తాకిడీ పెరిగింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు బొమ్మదేవర వెంకటసుబ్బారావు కుటుంబ సమేతంగా దర్శించారు. వారితో పాటు ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాంలు హజరయ్యారు. వారికి ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో స్వామివారి శేషవస్త్రాలను కప్పి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ సహాయకులు చక్రవర్తి పాల్గొన్నారు.

**షెడ్డు నిర్మాణానికి సాయం**

నగరానికి చెందిన వ్యాపారవేత్త నారాయణశెట్టి కిరణ్ ఆలయ ప్రాంగణంలో ఇంద్రపుష్కరిణి వెళ్లే మార్గంలో సొంత నిధులతో షెడ్డు నిర్మాణం చేపట్టేందుకు అంగీకరించారు. ఆలయానికి వచ్చే యాత్రకుల సౌకర్యార్థం నీడ నిచ్చేందుకు వీలుగా ఈ నిర్మాణం చేపట్టనున్నారు. గతంలో ఆయన బంగారు మఖర తోరణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి అభ్యర్థన మేరకు ఈషెడ్డు నిర్మాణానికి అంగీకరించారు.

**ఆదాయం రూ.6.46 లక్షలు**

యాత్రికుల తాకిడి పెగడంతో టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,19,500, విరాళాల రూపంలో రూ.56,537లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,70,000 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు.


మెమోంటోను అందజేస్తున్న ఎంఇఒ రామకృష్ణ

## నవోదయ మోడల్ పరీక్షకు స్పందన

**బూర్జ:** మండలంలోని బూర్జ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి జవహర్ నవోదయ మోడల్ పరీక్షకు 420 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఎంఇఒ నూక రామకృష్ణ తెలిపారు. నరసన్నపేట మండలానికి చెందిన ఎస్.హర్షవర్ధన్ 97 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఎం.ప్రత్యూషకుమార్ నిలిచారు. కార్యక్రమంలో బూర్జ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, విశ్రాంత డిప్యూటీ డిఇఒ ఐ.వెంకటరావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

**జలుమూరు:** మండల కేంద్రంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా సోమవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.


దాలినాయుడుకు వివరిస్తున్న అగ్నిమాపక అధికారి అప్పారావు

## సిసి రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారులో ఉన్న అగ్నిమాపక కేంద్రం స్థలంలో ప్రయివేటు వ్యక్తి ఆక్రమించి సిసి రోడ్డు నిర్మించడంతో వివాదం తలెత్తింది. అగ్నిమాపక కేంద్రం, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సైలాడ రెవెన్యూ పరిధి గాజులకొల్లివలస పంచాయతీ శ్రీహరిపురంలో సర్వే నంబరు 283/3లో 1982లో అప్పటి తెలుగుదేశం పార్టీ తమ్మినేని సీతారాం హయాంలో 67 సెంట్లు భూమిని అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. 1986లో అగ్నిమాపక కేంద్రం ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ స్థలం చుట్టూ మొక్కలు చేశారు. కానీ, స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించ లేదు. దీంతో పక్కనే ఉన్న చింతాడ దాలినాయుడు కొన్నేళ్ల క్రితం ఇల్లు నిర్మించారు. అప్పటి నుంచి అగ్నిమాపక స్థలాన్ని వినియోగిస్తూ వచ్చారు. కారు వెళ్లేందుకు ఆయన స్థలం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రం స్థలం నుంచి ఇంటికి రాత్రికి రాత్రే సిసి రోడ్డు నిర్మించాడు. అగ్నిమాపక సిబ్బంది స్పందించి ఇది ప్రభుత్వ స్థలమని, ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని దాలినాయుడుకు సూచించారు. అయినా సిసి రోడ్డు నిర్మించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అగ్నిమాపక సిబ్బంది ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సిసి రోడ్డు నిలుపుదల చేయాలని దాలినాయుడుకు ఆదేశించి నిర్మాణాన్ని నిలుపుదల చేశారు.


అధికారులతో మాట్లాడుతున్న గిరిజనులు

## సర్వే పనులు అడ్డగింత

**మెళియాపుట్టి :** ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా రోడ్డు డైవర్షన్‌లో డీపట్టా భూములకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేయాలని సవరచిపురుపల్లికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి సర్వే చేపట్టేందుకు శనివారం సాయంత్రం వచ్చారు. సమాచారం అందుకున్న గిరిజన రైతులు సర్వే పనులను అడ్డుకున్నారు. డీపట్టా భూములపైనే ఆధారపడి జీవనాధారం సాగిస్తున్నామని, డైవర్షన్ రోడ్‌లో డీపట్టా భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగారు. కార్యక్రమంలో సవర కుమార్, గిరిజన రైతులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న శ్రీనివాస్

## ఎమ్మెల్సీ శ్రీనివాస్ పరామర్శ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ టెక్కలి ఎంపిటిసి-2 కూన పార్వతి అత్త, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు తల్లి మల్లమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పార్వతి, సుదర్శనరావులను ఆదివారం పరామర్శించారు. ముందుగా మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈయనతో పాటు పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాడ చంటి, కళింగ కోమట్ల అధ్యక్షులు వారణాసి గోవిందరావు, దవళ కృష్ణారావు, బమ్మిడి తులసీరావు, కిల్లి అజయ్‌కుమార్, బసవల రమేష్, శిగిపల్లి మోహనరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాశీవిశ్వనాథ్ చౌదరి

## 'సొండిలను ఒబిసిలుగా గుర్తించాలి

**మందస :** సొండిలను ఒబిసిలో ప్రభుత్వం చేర్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాజారావు, రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి కోరారు. మండలంలోని హరిపురంలో సొండీల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొండీలకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షావుకారి నాగేశ్వరరావు, పాండవ చంద్రశేఖర్. నల్ల హడ్డి, నల్ల బాలకృష్ణ, నల్ల బాబూరావు, శ్రీధర్, వెంకటేష్, షావుకారి మోహనరావు, రత్నాల భీమారావు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్టు

**నౌపడ :** సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట తోటల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం అరెస్ట్ చేశామని నౌపడ ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో దాడులు చేపట్టామని అన్నారు. వారి వద్ద ఉనంచి రూ.2,600 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## 150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

**కవిటి:** మండలంలో శవసానపుట్టుగలో డాక్టర్ అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యాన కోట దాలయ్య జ్ఞాపకార్థం ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సోంపేటకు చెందిన డాక్టర్ శీలా 150 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యాన డాక్టర్ శీలా దంపతులను ఘనంగా సన్మానించారు.


డాక్టర్ శీలా దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

# రేకుల షెడ్‌లో అల్లాడుతున్న ఉద్యోగులు


రేకులషెడ్డులో నిర్వహిస్తున్న సచివాలయం

ప్రజాశక్తి- పొందూరు

ఈ చిత్రంలో కొబ్బరి కమ్మలతో పైన కప్పి కనిపిస్తున్న రేకుల షెడ్డు పొందూరు మండలం ధర్మపురం గ్రామ సచివాలయం. గ్రామంలో సచివాలయం నిర్వాహణకు అనువైన భవనం అద్దెకు దొరకకపోవడంతో ఈ రేకుల షెడ్డులోనే ఉద్యోగులు తమ విధులను నిర్వహించాల్సి వస్తుంది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఎండ తీవ్రత ఎక్కువుగా ఉండడంతో షెడ్డులో వేడితో పాటు, ఉక్కబోత ఎక్కువుగా ఉండి విధులు నిర్వహించలేకపోతున్నామని వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి వచ్చే గ్రామస్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎండ నుంచి కొంతైనా ఉపశమనం కలుగుతుంది అనే ఉద్దేశంతో రేకులపై కొబ్బరి కమ్మలను వేశామని చెబుతున్నారు. గ్రామంలో నూతనంగా సచివాలయ భవనం నిర్మిస్తున్నా ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నిలుపుదల చేశారు. త్వరితగతిన ప్రభుత్వం బిల్లులు చెల్లించి భవనం నిర్మాణంను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఎంపీ పరామర్శ

**పలాస :** మాజీ ఎంపీ కణితి విశ్వనాథం ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విశ్వనాథం కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకతీతంగా అందరినీ గౌరవించే వ్యక్తి అని అన్నారు. ఆయన ఎంపీగా ఉన్న సమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ముందుగా విశ్వనాథం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్, దాస్‌నాయుడు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

## అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ**


మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులకు ప్రాధాన్యతాపరంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని లొద్దపుట్టి పంచాయతీ అయ్యవారిపేటలో రూ.5 లక్షల వ్యయాంతో సామాజిక భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తీరు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, సర్పంచ్ ఆశి సులోచనరెడ్డి, ఎంపిటిసిలు పిట్ట హేమలత, ఆశి మందాకిని పాల్గొన్నారు.

## గంగా పుష్కరాలకు ఆర్‌టిసి బస్సులు

**పలాస:** గంగా పుష్కరాల యాత్రకు ఆర్‌టిసి బస్సులు వేశామని డిపో మేనేజర్ వేదుల శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద గంగా పుష్కరాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి మే 3 వరకు నిర్వహించనున్న గంగా పుష్కరాలకు ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రయాణికులు, యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్సు యాత్ర నాలుగు రోజుల పాటు సాగుతుందన్నారు. పలాసకు చెందిన మల్ల సూర్యనారాయణ గుప్త 25 మంది యాత్రికులను సొంత నిధులతో గంగా పుష్కరాలకు పంపించారు.


ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాసు


పొందూరు : మాట్లాడుతున్న రవికుమార్

# అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

ప్రజాశక్తి- పొందూరు

ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చివేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీపేటలో సర్పంచ్ పైడి రాంప్రాసద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అధ్యక్షతన ఆదివారం 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేఖతను తట్టుకోలేక ప్రతిపక్ష నాయకులపై ఆ పార్టీ మంత్రులు, నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అన్ని నిత్యవసర వస్తువులు ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంపుతో సామాన్యుడు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరావు, మండల ప్రధాన కార్యదర్శి వండాన మురళి, బొడ్డేపల్లి సత్యం, మొదలవలస సీతారామారావు, కూటి కుప్పల సన్యాసిరావు, సువ్వారి మధు పాల్గొన్నారు.

**భూ కబ్జాలకు అడ్డాగా పలాస**

**పలాస :** భూ కబ్జాలకు అడ్డాగా పలాస మారిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీస ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సూదికొండలో టిడిపి ఆధ్వర్యాన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని ఆఇవారం నిర్వహించారు. ముందుగా కాలనీ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్తులు, నియోజవర్గ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. అందుకు మంత్రి సీదిరి అప్పలరాజు వాటిని నియంత్రణ చేయాల్సిపోయి భూ కబ్జాలను ప్రోత్సాహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి నవీన్, గాలి కృష్ణారావు, సైన వల్లభ, చిన్ని, పైల చక్రధర్, సత్యం, రామకృష్ణ, రమేష్, నరసింహ పాల్గొన్నారు.


పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

# రాజకీయ ప్రాధాన్యత పెరగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తూర్పు కాపులు జీవనం సాగిస్తున్నారని, అత్యధిక జనాభా ఉన్న ఉత్తరాంధ్ర ప్రాంతంలో తగినంత రాజకీయ ప్రాధాన్యత లేక అన్నింటిలోనూ వెనుకబాటుకు గురవుతున్నారని టిపి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ మహాసభలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మంత్రి వర్గంలోను, ఇతర రాజకీయ పదవుల్లో స్థానిక సంస్థల్లో తగిన ప్రాధాన్యత ఉండేదన్నారు.

జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాజకీయ ప్రాధాన్యత తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు కాపులకు జనాభా ప్రతిపదికన పదవులు కేటాయించాలని, లేనిపక్షంలో రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యతను పెంచుకునేందుకు సమిష్టి పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా తూర్పుకాపు సామాజిక వర్గంలో వివిధ రంగాల్లో నిష్ణాతులుగా ఉన్న హరికాప్రసాద్, ఆనెపు రామకృష్ణలను సన్మానించారు.


సంఘీభావం తెలుపుతున్న తూర్పు కాపులు

# గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిఒక్కరూ పుస్తక పఠాన్ని అలవాటుగా మార్చుకోవాలని నగరంలోని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను అన్నారు. బలగ శాఖాగ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని పుస్తక ప్రదర్శ, చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచే సెల్‌ఫోన్లకు అలవాటు పడకుండా పుస్తకాలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అప్పుడే మేలు చేకూరుతుందన్నారు. గ్రంథాలమయంలో పుస్తకాలు చదివి సచివాలయం ఉద్యోగాన్ని సాధించిన తిలక్ పాల్గొని తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాల్లో నిక్షిప్తమై ఉన్న పుస్తకాల్లో అపారమైన మేధస్సు దాగి ఉందన్నారు. అందువల్ల ప్రతిఒక్క విద్యార్థీ పుస్తకాలను చదువుకునేందుకు గ్రంథాలయ్లాకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

**రణస్థలం:** జిల్లాలోని పలు శాఖాగ్రంథాలయాల్లో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. రణస్థలం శాఖ గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. అలాగే గృహిణులు, వృద్ధులు, విశ్రాంతి ఉద్యోగులు, పాఠకులు, విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వం పొంది నవలలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, పర్సనాలిటీ డెవలప్మెంట్, మ్యాగజైన్స్ (వార, పక్ష, మాస పత్రికలు) సంబంధించిన పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్లి చదువుకోవాలన్నారు.

**నౌపడ :** సంతబొమ్మాళి మండలం నౌపడ శాఖా గ్రంథాలయంలో వివిధ గ్రంథాలు, పురాణ, ఇతిహాసాలు, చిన్నపిల్లల పుస్తకాలు, వేమన, సుమతి శతకాలు తదితర పుస్తకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి, హెల్పర్ ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.


నౌపడ : పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఉగ్రసేను

**లావేరు :** లావేరు శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. చదవడం మాకిష్టంలో పి.రాధ ప్రథమ, ఎస్.రామారావు ద్వితీయ, ఆర్.లలితకు తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి గ్రంథాలయం తరుపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ. గడ్డియ్య పాల్గొన్నారు. అలాగే మురక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్ దమయంతి

# పలువురికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి- కవిటి**

అమ్మఒడిలో ఆడుతూ పాడుతూ ఉండాల్సిన ఆ చిన్నారికి అమ్మా అన్న పిలుపే కరువైంది. ఇప్పుడిప్పుడే పాఠశాలకు వెళ్తున్న చిన్నారులకు చిన్నిచిన్ని కథలతో లోకాన్ని పరిచయం చేస్తున్న ఆ కన్నతల్లి కానరాని వ్యాధితో కన్నుమూసింది. దీంతో దిక్కులేని పరిస్థితిలో ఉన్న ఆ చిన్నారులకు నాన్నమ్మే దిక్కైంది. వివరాల్లోకి వెళ్తే... కవిటి మండలం కపాసుకుద్దికు చెందిన శ్రీపురుషోత్తమ లక్ష్మి అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందింది. తండ్రి ఆదరణ లేకపోవడంతో నాన్నమ్మ వద్దే ఉంటున్న లక్ష్మి పిల్లలు హరి (6), ముఖుంద ప్రియ (1) దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కాయ దమయంతి ఆ చిన్నారులకు అండగా నిలిచారు. వారి దయనీయ పరిస్థితి తెలుసుకుని, వారి భవిష్యత్ అవసరాల రీత్యా ఆదివారం ఆ చిన్నారులకు రూ.10 వేలు, దుస్తులు అందించారు. అంతేకాకుండా దయనీయ పరిస్థితిలో ఉన్న చిన్నారులను దాతలు స్పందించి ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్, కర్రి బాలయ్య, పాతిన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

**సాధ్విక కుటుంబానికి...**

**జి.సిగడాం :** మండలంలోని మెట్టవలసకు చెందిన పైలా రాంబాబు, రామలక్ష్మిల చిన్న కుమార్తె 16 నెలల సాధ్విక వీధి కుక్కల కోరల్లో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, వ్యవసాయ మార్కెట్ సలహా మండలి చైర్మన్ పైడి శ్రీనివాసరావు



జి.సిగడాం : ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ, సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి బి.జగన్నాథనాయుడు, సర్పంచ్ కమోదుల సీతారాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**కేన్సర్ రోగికి...**

**వజ్రపుకొత్తూరు :** మండలంలోని బెండికి చెందిన అల్లాడ మహాలక్ష్మి కొన్ని నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తుంది. విషయం తెలుసుకున్న మన మైటీ హెల్పింగ్ ఫౌండేషన్ సభ్యులు రూ.పది వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేసి మనోధైర్యాన్ని అందించారు. అనారోగ్యం నుంచి ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాకేష్, రాజేష్, సతీష్, రేవతిపతి, జోగారావు, ప్రశాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.



## అచ్చెన్నను కలిసిన నాయకులు

**కోటబొమ్మాళి:** ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల మధ్య ఎండగట్టేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పోరాడాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. మండలంలోని నిమ్మాడలో తన క్యాంపు కార్యాయలంలో ఉన్నారన్న విషయం తెలుసుకన్న కార్యకర్తలు, నాయకులు ఆదివారం ఆయనను తమ సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన చేస్తుందని, దీంతో ప్రతిఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కలిసిన వారిలో కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస, చిన్నబమ్మిడి, కొత్తపల్లి, చిన్నసాన, నందిగాం మండలం బెజ్జిపల్లి, కణితూరు, బడగాం, సంతబొమ్మాళి మండలం నౌపడ, పాలతలగాం, గోవిందపురం, నర్సాపురం, నరసన్నపేట, పోలాకి మండలం రాజపురం, టెక్కలి మండలం లింగాలవలస గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు ఉన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న నైనీషా

## జూనియర్ మిస్ ఇండియా పోటీల్లో నైనీషా

**పలాస:** మహారాష్ట్ర రాష్ట్రంలోని ముంబాయిలో మూడు రోజులుగా మై సిటీ ఈవెంట్స్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జూనియర్ మిస్ ఇండియా జాతీయ స్థాయి పోటీల్లో నైనీషా పాల్గొని అద్భుత ప్రదర్శన ఇస్తుంది. 2022 అక్టోబరు 29, 30 తేదీల్లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జూనియర్ మిస్ ఇండియా పోటీల్లో నైనీషా ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో ఎంపికైన అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొన్నడంపై తండ్రి మల్లా శరత్ ఆనందం వ్యక్తం చేశారు. మూడు రోజుల తరువాత వచ్చే ఫలితాలు అనంతరం వెల్లడిస్తామని చెప్పారు.

## సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాశక్తి- కొత్తూరు**

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కంటమానుగూడ, తుమ్మికమానుగూడ, మహసింగిగూడ గిరిజన గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ పోస్టర్లను అంటించారు. అనంతరం సంక్షేమ పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు కళ్లపల్లి వాణి, పెదకోట సాధుబాబు, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, బి.శ్రీను, ఎల్.తిరుపతిరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంజీవరావు

## ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

**నందిగాం :** స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌కు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఐదో తరగతి ప్రవేశానికి 262 మంది విద్యార్థుల దరఖాస్తు చేసుకోగా, 207 మంది పాల్గొరని ప్రిన్సిపాల్ బీదమయంతి తెలిపారు. అలాగే సాయంత్రం నిర్వహించిన ఇంటర్మీడియట్ గురుకుల ప్రవేశ పరీక్షకు 260 మంది దరఖాస్తు చేసుకోగా, 192 మంది పరీక్షకు హాజరై పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల సంయుక్త కార్యదర్శి ఎన్.సంజీవరావు పరీక్షలను పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ మహమ్మద్ అలీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వైద్య శిబిరానికి స్పందన

**ప్రజాశక్తి- పలాస**

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, మంచి ఆహార అలవాట్లు చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని మాజీ కౌన్సిలర్ కొవ్వూరు సురేష్ కుమార్ రోగులకు సూచించారు. పలాస ఉదయపురంలో రజక సేవా సంఘం ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పేద రోగులకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించామని అన్నారు. ఈ మేరకు వైద్యాధికారులు



మందులను పంపిణీ చేస్తున్న సురేష్ కుమార్

విజయకుమార్, రాకేష్, బాలాజీలు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెమ్స్ మేనేజర్ చిన్నారావు, ప్రదీప్, తిరుపతి, కిషోర్, కొవ్వూరు బైరాగి, కొవ్వూరు గోపాల్, రట్టి మనోజ్ కుమార్, రాజాం కూర్మరావు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

## చలివేంద్రం ప్రారంభం

**పొందూరు:** పొందూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో జనసేన పార్టీ ఆధ్వర్యాన ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు యలకల రమణ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువుగా ఉండడంతో వాహనదారుల, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా మొదటి రోజు మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు గార బాబూరావు, మండల నాయకులు కొంచాడ సూర్య, పొన్నాడ బాలకృష్ణ, జరజాపు గణేష్, కోరాడ రాజు, గోవింద, లోలుగు సురేష్, చిన్న, వసంత్, రాజేష్, మధు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఉత్సవాలు ప్రారంభం

**పోలాకి :** మండలంలో గుప్పిడిపేటలో ఆదివారం పోలేరమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులంతా ముర్రాటలు పట్టకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఈ పండగను వందేళ్ల నుంచి నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలు 30 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి తాత, లండ యర్రయ్య, తులె పైడమ్మ పాల్గొన్నారు.

## 27న పోలాకి మండల సమావేశం

**ప్రజాశక్తి- పోలాకి**

ఈ నెల 27న మధ్యాహ్నం రెండు గంటలకు పోలాకి మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలె తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొవాలన్నారు. పూర్తి సమాచారం అధికారులు రావాలని సూచించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి- జి.సిగడాం**

మండలంలోని డి.ఆర్.వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంవత్సరం 1988-89 చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ కలయిక సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులంతా కలిసి నాటి, నేటి ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు మధ్య జరిగే జీవిత కథనాలు ఉత్తమ బోధనలు, గుర్తు చేసుకొని సంతోషాలు, ఆనందాలను వ్యక్త పర్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, ఉపాధ్యాయులు వంజరాపు సత్యం, ఎల్.వీరస్వామి, రమణారావు, మల్లీశ్వరావు, శోభీదేలి, డి.లక్ష్మంనాయుడు, చందక చిరంజీవి, వావిలపల్లి రమణారావు, నాయుడు, కుమరపు శ్రీను, బి.శ్రీను, పద్మ, గాంధీ పాల్గొన్నారు.




కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లర్పిస్తున్న సభ్యులు

## 'కణితి' మృతి తీరని లోటు

**పలాస:** మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం మృతి తీరని లోటని లయన్స్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. పలాస లయన్స్ క్లబ్‌లో విశ్వనాథం సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా కొవ్వొత్తులను వెలిగించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన విశ్వనాథం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. తన సొంత స్థలంతో పాటు లయన్స్ క్లబ్ నిధులతో నిర్మించిన భవనాలు సైతం ప్రభుత్వ ఐటిఐకు ధారాదత్తం చేసిన ఘనత ఆయనదిన్నారు. అనంతరం గతలో లయన్స్ క్లబ్ ట్రస్టీగా విశ్వనాథం కుమార్తె శారద, అల్లుడు రాజేష్‌లను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌దేవరకొండ, లయన్స్‌క్లబ్ సభ్యులు నెమలిపురి అప్పారావు, కార్యదర్శి తమ్మినేని మాధవరావు, కోశాదికారి వీరఘట్టం వెంకటరావు, కణితి హేమాచాలం, వజ్జ బాబూరావు, డాక్టర్ ఆర్ఆనందరావు, పైల సూర్యనారాయణ, పి.జవహర్ పాల్గొన్నారు.

## కోటేశ్వర చౌదరికి సన్మానం

**రణస్థలం:** మండల కేంద్రంలోని పిన్నింటిపేట రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వరా అపార్ట్‌మెంట్ ఆవరణలో మండల సొండీల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి పాలక మండలి సభ్యులు నెమలపురి కోటేశ్వర చౌదరికి ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా కోటేశ్వర చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం సొండీలకు మంచి గుర్తింపునిచ్చిందన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉందని గుర్తించి ఒసి నుంచి బిసి-డిలో చేర్పించిందన్నారు. అలాగే సొండీల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మొగలపురి కిషోర్‌కుమార్, ఎం.ఎం.రావు, పరిడాల మౌళీశ్వరరావు, సుధాకర్, ప్రకాష్, బాలరాజు, రమణబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న సంఘ నాయకులు